చిన్న కథ

# సెక్యూరిటీ



ఆర్కే అడపా

కలకత్తా మహా నగరంలో 'ఎస్ప్లెనేడ్' మెట్రో అండర్ గ్రౌండ్ స్టేషన్లో ట్రెయిన్కోసం కరుణ ఎదురు చూస్తోంది. ఎయిర్ కండిషన్డ్ ప్లాట్‌ఫారమ్ ఎంతో నీటుగా దేశానికి వన్నె తెచ్చేటట్లుగా ధీటుగా వుంది. ట్రెయిన్ వస్తున్నట్లు ఎనౌన్స్ చేస్తుండ గానే పరుగుపరుగున పెద్ద శబ్దం చేసుకుంటూ ప్లాట్‌ఫారమ్ మీదికి వచ్చి ఆగింది. ఆటోమేటిక్ డోర్స్ తెరుచుకున్న తక్షణమే దిగేవారు దిగుతు న్నారు. వెనువెంటనే కరుణ దూకుడుగా లోనికి వెళ్ళి కూర్చుంది. ఎంత వేగంగా వచ్చిందో అంత స్పీడు అందుకుంది. డోర్స్ క్లోజ్ అయిపోయాయి. కరుణ ఒంటరిగా ఉండడంతో ఆలోచనలు కూడా చుట్టుముట్టి అంతే వేగాన్ని అందుకున్నాయి.

కరుణ కలకత్తా లాంటి మహానగరాన్ని జీవి తంలో ఒక మారన్నా చూడగలననుకోలేదు. బి.ఎ చదువుతూ కంప్యూటర్ చేసింది. సరదాగా పేపరు తిరగవేస్తూ ఫైనాన్స్ కంపెనీ ఏడ్ చూసి అప్లై చేసింది. అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ రావడం, కరుణ తండ్రికి హౌరా రైల్వేలో పనిచేస్తున్న ఫ్రెండ్ ప్రకాశం అక్కడ రైల్వే క్వార్టర్స్లో వుండడం, కాంటాక్ట్ చేయడం, ఉద్యోగంలో చేరడం అన్నీ కాకతాళీయంగా చకచకా జరిగిపోయాయి.

రైలుసడన్ బ్రేకు పడడం, డోర్స్ విడిపోవడం, ఉలిక్కిపడ్డ కరుణ తక్షణం లేచి ప్లాట్‌ఫారమ్ మీదికి దూకింది. అందరూ త్వరత్వరగా నడుస్తు న్నారు. ప్రపంచంలో ఎక్కడలేని ఫ్యాషన్స్ ఇక్కడే కనిపిస్తున్నాయి. ఎవరి తొందరవారిది. ఒకటే పరుగులాంటి నడక. సిల్క్‌లో సెల్ఫ్‌చెక్స్ చీర చాందినీ ప్రింట్‌లా కనిపించే డిజైన్ వేసుకుంది కరుణ. సన్నని గొలుసు మెడలో మెరుస్తోంది. ఒక మోస్తరు హేండ్‌బ్యాగ్ చేత్తో బిగుతుగా పట్టు కుంది. హంస నడకలో వయ్యారంగా నడుస్తున్న కరుణవైపు వింతగా చూస్తున్నారు. ఆమె నడవడిక, దుస్తుల్లో ఏదో కొత్తదనంతో ప్రాంతానికి చెందిన వ్యక్తిలా కనిపించక పోవడం వలనేమో.

కరుణ ఉద్యోగంలో చేరే కొత్తల్లో ఎంతో కంగారు, భయం, ఫీల్ అయ్యేది. వెకిలి నవ్వులు, చిలిపి చేష్టలు, కేరింతలు నవ్వులాటలు, భుజాలు ఢీకొ ట్టడం, బస్సుల్లో మీద పడటం 'సారీ' వ్యవహా రాలు, ఎన్నెన్నో అనుభవాలు. వీటితో రోజుల్లా విలవిలలాడిపోయేది. ఉద్యోగానికి తిలోదకాలి చ్చేసి, సొంతవూరు వైజాగ్ పారిపోవాలనిపించేది. అంకుల్ ప్రకాశం ఓదార్పుతో సరిపుచ్చుకునేది.

ఒకరోజు కరుణ ముచ్చెమటలతో ఆఫీసుకు వెళ్ళి సీట్లో చతికిలపడగానే సుధారాయ్ భుజం తట్టింది. కరుణ చెప్పిందంతా విని 'ఓ! కరుణా కేటిక్ ఈజీ, వీళ్లంతా యిలాగే బిహేవ్ చేస్తారు. మ్యారీడ్ లేడీస్ అయితే ఎక్కడలేని రెస్పెక్ట్ చూపిస్తారు' అంది.

"సిస్టర్, నేనీ జాబ్ వదిలేసి మావూరు వెళ్ళి పోతాను" ఎంతో నిరుత్సాహంగా ముఖంమీద చిరుచెమటల్ని హేండ్ కర్చీఫ్‌తో ఒత్తుకుంటూ అంది.

"తొందరపడకు, నిదానంగా ఆలోచించు, ఇవన్నీ టెంపరరీ ప్రోబ్లమ్స్" ఎదురుగా కూర్చుని వింటున్న జ్యోతీగుప్తా అంది.

"ఒక పని చేయకూడదు" అంది సుధారాయ్. సడన్‌గా ఏదో స్ఫురణకు వచ్చి.

చెప్పండి, అన్నట్లు ఆమె ముఖంలోకి చూసింది.

"నీ నుదుటికి సిందూరం తగిలించు, సేవ్ అయిపోతావ్" అంది.

"అంటే" అనుమానంగా రాయ్ వైపు చూస్తూ అడిగింది.

'ఆ! ఏమీలేదు! మ్యారీడ్ లేడీస్ అనుకుని దూరంగా మసలుకుంటారు. ఒళ్ళు దగ్గర పెట్టు కుంటారు"

కరుణకి ఈ ఉచిత సలహా ఎందుకో బాగా నచ్చింది.

ఆ మర్నాడు నుండే పాపిడికి ఎర్రటి సిందూరం పూసుకోవడంతో చాలామందిలో ఎంతో మార్పు చూసింది. అదే ఎంతో సుఖం, సెక్యూర్టీ అనిపించింది.

అంకుల్, ఆంటీ వాళ్ళ పిల్లలతో అప్పుడప్పుడు కలకత్తా మహా పట్టణంలో చూడవలసినవి. కాళీ ఘాట్, బిర్లా ప్లానిటోరియం బేలూర్ మఠ్, సాలార్ జంగ్ మ్యూజియం, జైన్ మందిర్, హౌరా బ్రిడ్జి బస్సుల్లో, ట్రామ్ మీద చుట్టబెట్టింది. ఆకాశా న్నంటే మహా కట్టడాల్ని చూసేటప్పుడు ఎక్కడలేని ఆశ్చర్యం, ఆనందం కలగేది. ఆ ప్రక్కనే మురికి కుళ్ళు కాలువ ప్రక్కన దీనంగా బ్రతుకులీడ్చే దైన్యాన్ని చూసి దుఃఖించేది

కరుణ ఒకరోజు ఆఫీసుకు శెలవుపెట్టి ఆ మర్నాడు వెళ్ళేసరికి తనకోసం ఎవరో వచ్చి వాక బుచేసి వెళ్ళినట్టు ప్యూను చెప్పాడు. తనని వెతుక్కుంటూ వచ్చే వారెవరూ ఈ నగరంలో లేరు. ఎవరై వుంటారు, అనుమానాస్పదంగా ప్రశ్నిం చుకుంది. జవాబు దొరక్క తన పనిలో పడిపో యింది.

మెట్రో ట్రయిన దిగి, బస్సెక్కి, అదే ఆలోచనతో ఇంటికి చేరుకుంది వారం రోజుల తరువాత కరుణ తండ్రి దగ్గర్నుండి ఘాటైన టెలిగ్రామ్, ఉద్యోగం మానేసి వెంటనే ఇంటికి రమ్మనమని రావడంతో, అంతా అయోమయంగా తోచింది కరుణకి, అటు ప్రకాశం అంకుల్‌కి కూడా. కోర మాండల్‌లో వైజాగ్ బయలుదేరింది. ఇంటికి చేరగానే కరుణ తండ్రి కోపావేశంతో ఊగిపోవడం చూసింది. ప్రకాశం మీదికి విరుచుకుపడ్డాడు.

"నీమీద ఎంతో నమ్మకంతో అమ్మాయిని పంపాము, నీకు అన్నీ తెలిసే నన్ను మభ్యపె ట్టావ్" చీదరించుకున్నట్లు నిందవేశాడు కరుణ తండ్రి.

"రావ్! కంట్రోల్ యువర్ సెల్ఫ్, నీవు అంటు న్నదేమీ నాకు అర్థం కావడంలేదు" అన్నాడు.

"కరుణకి మంచి సంబంధం వచ్చింది. అమ్మా యిని నేరుగా కలుసుకొని చూడటానికి ఆ అబ్బాయి కలకత్తా ఆఫీసుకు వెళ్ళాడు..."

"ఎప్పుడూ, వాకసలు తెలియదే" మధ్యలో అడి గాడు. కరుణ తలుపువారగా వచ్చి నిలుచొని వింటోంది.

"అయితే ఏమైంది డాడీ" ముందుకొచ్చి అడి గింది. "మీ ఆఫీసులో విచారించి వాకబుచేస్తే, కరుణ అంటే ఆ పెళ్ళయిన అమ్మాయేగా, అని శెలవుపెట్టిందని చెప్పారట" గొంతెత్తి అరచినంతగా చెప్పాడు.

ఆ మాటకి కరుణ ఆశ్చర్యపోయింది.

ప్రకాశం గొంతులో వెలక్కాయ పడ్డట్లయ్యింది.

కరుణ ఏం సమాధానం చెపుతుందోనని ఆమెవైపు తిరిగాడు.

"ఓస్! అదా డాడీ, ఈ సిందూరం చూడండి.... బెంగాల్‌లో నుదుట సిందూరం పెట్టుకుంటే పెళ్ళ యిన స్త్రీల క్రింద లెక్క. మన ఆంధ్రాలో ఆడవాళ్ళు మెడలో నల్లపూసల త్రాడుంటే పెళ్ళ యినట్లు. అక్కడ సిందూరానికి అంత సెక్యూర్టీ ఆడవాళ్లకి ఉంటుంది. నన్ను నేను అల్లరిపాలు కాకుండా జాగ్రత్త పడటానికే అందర్నీ మభ్యపె ట్టాను, అది తప్పా!" ఉద్వేగంతో కరుణ చెప్పగానే అటు తల్లిదండ్రులు, ఇటు ప్రకాశం అంకుల్ అవాక్కయిపోయారు.

కరుణ తన కూతురు అలాంటిది కాదు అని తల్లి అక్కున చేర్చుకుంది.